క్లుప్తంగా

వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలి

కల్లూరు: చెత్త సంపద కేంద్రాల్లో (ఎస్‌డబ్ల్యూపీసీ) వర్మీకంపోస్టు తయారు చేయాలని ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం పెద్దటేకూరు గ్రామంలో ఆయన పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. గ్రామంలోని పింఛన్ లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన ఉద్యానవన పంటలను పరిశీలించారు.

దెబ్బతిన్న కల్వర్టును బాగు చేయాలి



దెబ్బతిన్న కల్వర్టును చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 31వ వార్డు రాఘవేంద్రనగర్‌కు వెళ్లే రోడ్డుపై కృష్ణానగర్ ఐటీసీ కూడలి సమీపంలో దెబ్బతిన్న కాల్వర్టు పని త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం నాయకులు యేసు, రాజు, మధు తదితరులు దెబ్బతిన్న కాల్వర్టును పరిశీలించారు. వాహనదారులు, ప్రయాణికులు ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదానికి గురికావాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న కాల్వర్టును బాగు చేయాలని కోరారు.

రోడ్డుపై మురుగునీరు తొలగించాలి

ఓర్వకల్లు: రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీటిని వెంటనే తొలగించాలని వ్య.కా.స రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కన్నమడకల గ్రామాన్ని సందర్శించి, పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక వడ్డెగేరి ప్రాంతంలో వర్షపు నీటితో పాటు బాత్‌రూం మురుగునీరు రోడ్డుమీద నిల్వ ఉండటం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న దృశ్యాన్ని గమనించారు. ప్రజల చేత ఓట్లు వేయించుకుని పదవులు అనుభవిస్తున్న ప్రజా ప్రతినిధులకు ఇలాంటి సమస్యలు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మక్కలి స్వాములు, జయకృష్ణ, ఉయ్యాలవాడ మద్దిలేటి, శ్రీనివాసులు, తొర్రి జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గంబూసియా చేపల విడుదల

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ చెరువు, కొంగనపాడు వంకలో గంబూసియా చేపలను సర్పంచ్‌లు మాసేపోగు సుంకులమ్మ, సువర్ణ, వైద్యాధికారులు వదిలారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తలో భాగంగా గంబుసియా చేపలను వదిలినట్లు సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి రఘు, ఉలిందకొండ పీహెచ్‌సీ వైద్యుడు ఆనందరావు తెలిపారు. ఈ చేపలు నీటిలోని దోమల లార్వాను ఆహారంగా తీసుకుని దోమలు వృద్ధి చెందకుండా నివారిస్తాయన్నారు. అంతకుముందు వైద్యాధికారులు ఉలిందకొండ పీహెచ్‌సీ పరిధిలోని కొల్లంపల్లితండాలో సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ నాగరాజు, ఆరోగ్య విద్యా బోధకురాలు స్వర్ణగౌరి, ఆరోగ్య కార్యకర్త వెంకటరంగమ్మ పాల్గొన్నారు.

వివాదంగా బండల తొలగింపు

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు ప్రభుత్వ పాఠశాలలో మైదానం చదును చేసే పనులు వివాదంగా మారాయి. గురువారం ప్రాథమిక పాఠశాల ముందు పిల్లలు బురదలో నడవకుండా ''నాడు–నేడు'' పథకం కింద బండల పరుపుతో ర్యాంప్ వేశారు. అయితే ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్, పీఈటీలు తెలియజేయకుండా ర్యాంప్‌లో వేసిన బండలను తొలగించడం వివాదానికి దారితీసింది. ఈ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓ కోటయ్యకు ఫిర్యాదు చేశారు. బండల తొలగించిన విషయం తమ దృష్టికి వచ్చిందని, ఆయా హెచ్‌ఎం, పీఈటీలతో మాట్లాడిన తరువాత వారు మైదానం అభివృద్ధి పనులలో భాగంగానే తొలగించామని, తిరిగి యథావిధిగా పనులు చేసి పిల్లలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంఈఓ తెలిపారు.

రుణాల రికవరీని వేగవంతం చేయండి

సి.బెళగల్: పొదుపు గ్రూపు సభ్యులు బ్యాంక్ రుణాల రికవరీని వేగవంతం చేయాలని ఏపీఎం రామేశ్వర్ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సీసీలు, వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న సీఐఎఫ్ రుణాలను నిర్ణీత గడువులోగా వసూలు చేయించి రుణాలను రీ షెడ్యూల్ చేయించాలన్నారు. సభ్యుల సమావేశాలను రెగ్యులర్‌గా నిర్వహించి పొదుపు సంఘాలు, సభ్యుల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సీసీలు శ్రీనివాసులు, మాదులు, రాముడు, మహబూబ్‌బాషా, గుండమయ్య పాల్గొన్నారు.

వాడవాడలా గణనాథుడు

కొన్ని చోట్ల బుజ్జిబుజ్జి గణపయ్యలు.. మరికొన్ని చోట్ల బొజ్జ గణనాథులు.. ఇంకొన్ని చోట్ల రౌద్ర రూపంలో ఆది దేవుడు.. ఇలా గ్రామగ్రామానా వినాయకుడు కొలువయ్యాడు. ప్రత్యేకంగా అలంకరించిన మంటపాల్లో గణనాథుల ప్రతిమలను కొలువు దీర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ వినాయక చవితి వేడుకల్లో పాల్గొంటున్నారు. శివపార్వతుల పుత్రుడికి భక్తులు అర్చకుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం మరోసారి పూజలు నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతుండటంతో కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల్లోని ప్రతి పల్లెలో ఆధ్యాత్మికత ధ్వనిస్తోంది. –కర్నూలు (రూరల్)



సి.బెళగల్‌లో పూజలందుకుంటున్న 16 అడుగుల గణేషుడు





గార్గేయపురం బీసీ కాలనీలో కొలువుదీరిన గణనాథుడు, సూదిరెడ్డి పల్లెలో.., పసుపుల నీలిషికారి పేటలో..

కర్నూలు మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం గణనాథుల ప్రతిమలను కొలువుదీర్చారు. వివిధ రకల పూలు, మామిడి తోరణాలు, టెంకాయ మట్టలు, అరటి ఆకులు, విద్యుత్ కాంతులతో అలంకరించిన మంటపాలలో ఆదిదేవుడిని కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్లు, మొక్కజొన్న పొత్తులు, వెలగపండ్లు, లడ్డూలు, గుగ్గిళ్లు, చెరకు గడలు, కుడుములు, భక్ష్యాలు తదితర పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కర్నూలు మండల పరిధిలో దాదాపు 230 విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు ఆయా గ్రామాల నిర్వాహకులు తెలిపారు.

● సి.బెళగల్ మండలంలో..



సి.బెళగల్ దాసరివీధిలో మహా గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల వ్యాప్తంగా అధికారికంగా 54 విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు. అనధికారికంగా మరో 60 దాక చిన్న విగ్రహాలను ఏర్పాటైనట్లు సమాచారం. కాగా సి.బెళగల్‌లోని డాక్టర్ నాయుడు వీధిలో 16 అడుగుల భారీ శివగణేష్ విగ్రహం కొలుదీరింది. గురువారం మండల కేంద్రం సి.బెళగల్లో సర్పంచ్ పాండురంగన్న, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ముందరింటి వెంకటేష్ గణేష్ ఉత్సవాలలో పాల్గొని వినాయకులకు పూజలను నిర్వహించారు. ఆయా వినాయక మంటపాల వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. మండంలో ప్రతిష్ఠించుకున్న వినాయక విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేయనున్నట్లు వినాయక ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. పోలకల్‌లోని చెన్నసోమేశ్వర ఆలయ ఆవరణంలో కొలువైన మహాకాయ విఘ్నేశ్వరుడు మాత్రం ఐదు రోజులపాటు పూజలు అందుకోనున్నాడు.




కోడుమూరులో కొలువుదీరిన గణనాథులకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● కోడుమూరు రూరల్: కోడుమూరులో 3 నుంచి 12 అడుగులలోపు వినాయక విగ్రహాలను 150కు పైగా కొలువుదీర్చారు. మండలంలోని వర్కూరు, క్రిష్ణాపురం, ముడుమలగుర్తి, పులకుర్తి, లద్దగిరి, గోరంట్ల, అనుగొండ, అమడగుంట్ల గ్రామాల్లోనూ ప్రజలు వినాయక విగ్రహాలను భారీగా ఆశీనులనుచేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని వినాయక మండపాల వద్ద నిర్వాహకులు పెద్ద ఎత్తున ప్రజలకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కాగా శుక్రవారం వినాయక విగ్రహాలను వెంకటగిరి రోడ్డువైపు ఉన్న బావిలో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ఎర్రిస్వామి సూచించారు.

● గూడూరులో..

మండలంలో 3నుంచి 9 అడుగులలోపు వినాయక విగ్రహాలను 50కు పైగా నిర్వాహకులు కొలువుదీర్చారు. కాగా వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ఐదవ రోజు జరుపుకోవాలని కొందరు నిర్వాహ కులు చర్చించుకుంటుండగా, బందోబస్తు దృష్ట్యా శుక్రవారం రోజే నిమజ్జనం చేసుకోవాలని పోలీస్ అధికారులు సూచించారు.



కోడుమూరులో శ్రీరుద్ర వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు అన్నదాన కార్యక్రమం

విఘ్నాలు తొలగించయ్యా..విఘ్నేశ్వరా



ఓర్వకల్లులో కొలువైన గణనాథుడు



కొమరోలు వినాయకుడు

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో కొలుదీరిన వినాయకుని విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విఘ్నాలు తొలగించయ్యా..విఘ్నేశ్వరా! అంటూ గణనాథులకు మొక్కుకున్నారు. ఓర్వకల్లు, కొమరోలు, హుసేనాపురం, నన్నూరు, ఉయ్యాలవాడ, శకునాల, బ్రాహ్మణపల్లె, సోమయాజులపల్లె, లొద్దిపల్లె తదితర గ్రామాల్లో వినాయకుని మండపాల వద్ద నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా



తిరుమలగిరి కాలనీలో..



పాణ్యం: పూజల్లో పాల్గొన్న మహిళలు



పాణ్యం: షాధిఖానా వద్ద..

పాణ్యం: మండల వ్యాప్తంగా 97 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పండుగ సందర్భంగా మండపాలను విద్యుత్ కాంతులతో అలంకరించగా, వివిధ రూపాల్లో విరాజిల్లిన గణనాథులు భక్తులను ఆకట్టుకున్నారు. తిరుమలగిరి కాలనీ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, కొండజుటూరు సర్పంచ్ సద్దల సుజిత్ రెడ్డి, రచనారెడ్డి పూజలు చేశారు. మన గ్రోమోర్ వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి పూజలు నిర్వహించారు. షాధిఖానా వద్ద తల్లి పార్వతిదేవి ముందు కొలువుదీరిన వినాయకుడి విగ్రహం విశేష ఆకర్షణగా నిలిచింది.

వినాయకుడికి చాక్లెట్ల మాల



చాక్లెట్ మాలలో వినాయకుడు

● పాణ్యం: మండలంలోని కొణిదేడు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి నిర్వహకులు చాక్లెట్ మాలను అలంకరించారు. ఆ మాలలో యాపిల్ పండ్లను కూడా జతచేసి వినూత్నంగా తీర్చిదిద్దారు. చాక్లెట్‌లతో అలంకరించిన స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

గణనాథుడికి కాటసాని పూజలు



వినాయకుడిని దర్శించుకున్న కాటసాని

కల్లూరు: వినాయక చవితి సందర్భంగా కల్లూరు అర్బన్ వార్డుల్లో కొలువైన గణనాథులకు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. విఘ్నాలు తొలగించి విజయాలను అందించే మహాగణపతి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని ఆకాంక్షించారు. ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కార్పొరేటర్లు, వైఎస్సార్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పాణ్యం: కారు టైరు పేలి వాహనం అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. మండల పరిధిలోని సుగాలిమెట్ట సమీపంలో జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. హైవే పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన మహబూబ్ కుటుంబ సభ్యులతో కలిసి కోసిగికి వెళ్తుండగా కారు టైర్‌పేలి అవతల రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న మహబూబ్‌తో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కర్నూలు నగరంలో ఎస్‌ఏపీ క్యాంపు ఎదురుగా ఉన్న బాలగంగాధర్ తిలక్ నగర్‌లో 50 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టాల సాధన సమితి ఆధ్వర్యంలో సి. చలపతి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నగర కార్యదర్శి రాముడు, నాయకులు నగేష్, కిరణ్మయి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారందరికీ జీఓ నంబర్ 30 ప్రకారం ఇంటి పట్టా ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని తెలిపారు. పట్టాల సాధన కమిటీ సభ్యులు మురళి, కృష్ణ, వెంకటేశ్వర్లు, రమేష్, మల్లికార్జున, వెంకటలక్ష్మమ్మ, పురుషోత్తం, సిద్ధప్ప, వెంటేశ్వరమ్మ, శకుంతల, మునెమ్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా చెత్త సేకరణ



ఎ.గోకులపాడులో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీపీఓ

కల్లూరు: గ్రామాల్లో చెత్త సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) భాస్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం కల్లూరు మండలం ఎ. గోకులపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓలు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్యం పనులు పర్యవేక్షించాలన్నారు. పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కోడుమూరు రూరల్: గూడూరు మండలం కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి గాయపడ్డాడు. కె.నాగలాపురం ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లే రోడ్డులో ఈనెల 26న రాత్రి కె.నాగలాపురం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై తీవ్రగాయాలతో పడివుండగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. తలకు తీవ్రగాయాలు కావడంతో వ్యక్తి కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు తెలిపారన్నారు. వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, బ్యాగులో దుప్పటి, దుస్తులు ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు 9121101068 నంబర్‌కు సమాచారమివ్వాలని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి కోరారు.

నివాళి



సుధాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

కోడుమూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నేత బొమ్మన సుధాకర్‌రెడ్డి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ బుధవారం కొత్తపల్లెకు వెళ్లి సుధాకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్ రెడ్డి, క్రిష్ణాపురం సర్పంచు శ్రీనివాసరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటాలకు సిద్ధం



నిరసన తెల్పుతున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం సామాన్యుడిపై మోపుతున్న విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు క్రిష్ణ కోరారు. బషీర్‌బాగ్ మృతుల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలను గురువారం పాతబస్టాండ్ సెంటర్‌లో నివాళులర్పించారు. అనంతరం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు కరెంట్ చార్జీలను పెంచబోమని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయమంటూ ఉపన్యాసాలిచ్చి ఇప్పుడు చార్జీలను పెంచేయడంతో పాటు, స్మార్ట్ మీటర్లను బిగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, మాధవస్వామి, శేషుకుమార్, చిన్న రాముడు, మునిస్వామి, రంగస్వామి, సులోచనమ్మ, బాబురావు, హనుమంతు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

గూడూరులో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా గురువారం గూడూరులో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో సర్ చార్జీల పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దానమన్న, కొమ్మురాజు, కృప, నాగేష్, సురేష్, చిన్న రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఓర్వకల్లు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 ఆగస్టు 28న జరిగిన విద్యుత్ ఉద్యమం ''చలో అసెంబ్లీ'' కార్యక్రమంలో, హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో పోలీసులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన కామ్రేడ్స్ విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిని వామపక్షాలు గురువారం స్మరించుకున్నాయి. స్థానిక సచివాలయం ఎదుట సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, సిపిఐ మండల నాయకుడు సుధాకర్ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ విద్యుత్ ధరల పెంపు దిశగా అడుగులు వేస్తోందని, అధాని ఒప్పందాలను రద్దు చేస్తామన్న హామీలను నిలబెట్టుకోకుండా పాత విధానాలకే కట్టుబడిందని విమర్శించారు. ఇలాగే కొనసాగితే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతుకు పంట కోత యంత్రాన్ని అందజేస్తున్న ఏపీజీబీ ఆర్‌ఎం నవీన్‌కుమార్, మేనేజర్లు

కోడుమూరు రూరల్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీజనల్ మేనేజర్ నవీన్ కుమార్ సూచించారు. గురువారం కోడుమూరు, కృష్ణగిరి ఏపీజీబీల పరిధిలోని ఇద్దరు రైతులకు రూ.1.06 కోట్ల విలువ చేసే పంట కోత యంత్రాలను మేనేజర్లు సుదర్శన్‌రెడ్డి, రజాక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఏపీజీబీ ద్వారా రైతులకు వ్యవసాయ రుణాలు, మహిళలకు పొదుపు రుణాలతో పాటు, ఇంటి, బైక్, కార్ల కొనుగోలుకు రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు రీజినల్ రుణ కేంద్రం మేనేజర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.